సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



జజ్జనకర జనారే.. జాతర భళారే..!
రాజంపేట పట్టణంలోని బలిజపల్లెలో గురువారం గంగమ్మ జాతర సంబరం అంబరమంటింది. భారీ సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. -8లో



విద్యుత్ శాఖలో 'మాయగాడు'!
గాలివీడులో విద్యుత్ శాఖకు చెందిన జూనియర్ లైన్‌మెన్ రామేశ్వర్‌రెడ్డి రూ.20 లక్షల విద్యుత్ బిల్లులు వసూలు చేసి ఉడాయించాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

6న జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: జిల్లా సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ బాల,బాలికల జట్లు ఎంపిక ఈనెల 6వతేదీన నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్‌బాల్ కార్యదర్శి గౌతమి తెలిపారు. స్థానిక నిమ్మనపల్లె బైపాస్ రోడ్డులోని ప్రైమ్ స్పోర్ట్స్ ఆరేనాలో ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు 01.4.2008 తరువాత పుట్టినవారు అయివుండాలన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు తప్పకుండా తీసుకురావాలన్నారు. వివరాలకు 62818 81022ను సంప్రదించాలని కోరారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ: పాలిటెక్నిక్ కళాశాలల ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్షకు విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.ఓబులేసు తెలిపారు. ఈనెల 30వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ ఏప్రిల్ 1తేదీ నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95426 90906 ను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబ సెంటర్: అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, కెవి పల్లిలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి పలు తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి డి.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుండి 9వ తరగతులలో అర్హులైన విద్యార్థినుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థినులు twreiscet.apcfss.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 9వ తేదీలోపు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94411 46908, 7382264994, 94414 94161 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీసీ కులగణన చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమణ

రాయచోటి అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమణ తెలిపారు. రాయచోటి పట్టణంలో గురువారం బీసీ సమన్వయ కమిటీ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ కులగణనను చేపట్టడంతో పాటు బీసీల అభివృద్ధికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకోవాలంటూ కోరారు. బీసీల కులగణనతోనే రాజ్యాధికారంతో పాటు అన్ని రకాల అభివృద్ధి జరుగుతుందన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే క్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈనెల 11న అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపడతున్నామన్నారు. జిల్లాలోని బీసీలందరూ విజయవంతం చేయాలంటూ కోరారు. సమావేశంలో బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.వి.రమణ, కన్వీనర్ ఇడగొట్టు నాగేశ్వరరావు, నేతలు జీవానందంతో పాటు పలువురు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆరోగ్య భరోసా



మాట్లాడుతున్న డాక్టర్ లోకవర్ధన్

రాయచోటి అర్బన్: 70 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఆరోగ్యభరోసా కల్పించనున్నట్లు అన్నమయ్య జిల్లా ఎన్‌టీఆర్ వైద్యసేవా ట్రస్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ లోక వర్ధన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత ప్రభుత్వం అయుష్మాన్ భారత్ – భారత ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన (పీఎంజేఏవై)ను ప్రారంభించిందన్నారు. పీఎంజేఏవై అనే పథకం అతిపెద్ద ఆరోగ్య భరోసా పథక అన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఒకొక్క కుటుంబానికి సంవత్సరానికి రూ.5లక్షల వరకు ఆరోగ్యబీమాను ఇస్తారన్నారు. అన్నమయ్య జిల్లాలో 1,10,298 నూతన ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై లబ్ధిదారులను గుర్తించామన్నారు. ఇప్పటికే ఏఎన్‌ఎంలు తమ పరిధిలో ఉన్న 70 సంవత్సరాల సీనియర్ సిటిజన్స్‌ను గుర్తించి వారిని ఎన్‌రోల్‌మెంట్ చేసి ఈకేవైసీ చేసి పీఎంజేఏవై వయోవందన కార్డులను డౌన్‌లోడ్ చేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కార్డులు పొందని అర్హులు తమ సచివాలయం పరిధిలోని ఏఎన్‌ఎంలను సంప్రదించి వయోవందన కార్డులను పొంది సద్వినియోగం చేసుకోవాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

అల.. ఏకశిలానగరిలో..

రాష్ట్ర విభజన తర్వాత ఒంటిమిట్ట రామాలయం టీటీడీలోకి విలీనమైంది. టీటీడీ ఏటా బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తోంది. ఈ ఏడు కూడా ఈ నెల 5 నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. తొలిరోజున అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈనెల 11న రాములోరి కల్యాణం కన్నుల పండువగా చేయనున్నారు. ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట రామయ్య క్షేత్రం ప్రత్యేక కళను సంతరించుకుంది.

- జాంబవంతుడు ప్రతిష్టించిన రామక్షేత్రం!
- త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసమే ఏకశిలానగరం
- ఆంజనేయుడు లేకపోవడమే ఆలయ ముఖ్య విశేషం
- వంటడు..మిట్టడుతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ
- రేపటి నుంచి ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు
- 11న రాములోరి కల్యాణానికి టీటీడీ సమాయత్తం



ఒంటిమిట్ట కోదండ రామాలయం వ్యూ



ఏకశిలపై సీతారామలక్ష్మణ మూర్తులు

ఒంటిమిట్ట (రాజంపేట): ఒంటిమిట్టలోని కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టనున్నారు. రోజుకొక అలంకారంలో రామయ్య భక్తులకు దర్శనమివ్వనున్నాడు.

ప్రధాన విశేషం..
సీతారామలక్ష్మణులు కొలువుదీరిన ఏ ఆలయంలో అయినా హనుమ కూడా దర్శనమిస్తారు. అయితే ఒంటిమిట్ట గుడిలో సీతారామలక్ష్మణులు మాత్రమే ఏకశిలపై దర్శనమిస్తారు. ఆంజనేయుడి విగ్రహం లేదు. అయితే ఆలయ తూర్పు గాలిగోపురానికి తూర్పుగా రథశాల పక్కనే సంజీవరాయుడుగా వెలసిన ఆంజనేయస్వామి గుడి నిర్మించారు.

త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసం..
త్రేతాయుగంలో సీతారామలక్ష్మణులు ఈ ప్రాంతంలో కొంతకాలం నివసించారని పురాణ కథనం. అప్పుడు సీతమ్మకు దప్పిక అయింది..రాముడు బాణం సంధించి భూమిలోకి వదిలాడు. నీరుపైకి ఎగజిమ్మింది. సీతమ్మ దప్పిక తీరింది. లక్ష్మణుడు అన్న అనుజ్ఞతో తాను ఒక బాణం వదిలాడు. నీరుపైకి వచ్చింది. ఆ నీటిబుగ్గలనే నేడు రామతీర్థం..లక్ష్మణతీర్థం అని పిలుస్తున్నామనే కథ పురాణాల ద్వారా తెలుస్తోంది.

ధర్మ సంస్థాపన కోసం ఒంటిమిట్ట గుడి..
రాముడిక్కడ కోదండం ధరించి ఉన్నాడు. కోదండం ధర్మరక్షణకు ప్రతీక. అలనాడు శ్రీరామచంద్రుడు అడవుల్లో తిరుగుతూ నార వస్త్రాలు ధరించినా కోదండాన్ని విడువలేదు. అది ధర్మరక్షణ కోసమే. బుక్కరాయులు తర్వాత సిద్దవటం మట్లిరాజులు ఆలయాన్ని అత్యంత వైభవోపేతంగా తీర్చిదిద్దారు. అనంతరాజు, తిరుమలరాయలు, తిరువెంగళనాథరాజు, కుమార అనంతరాజులు ఒంటిమిట్ట కోవెలను తీర్చిదిద్దారు. ఉన్నతమైన ప్రాకారకుడ్యాలు సమున్నతమైన గోపుర శిఖరాలు రంగమంటపాల్లో అద్భుత శిల్పవిన్యాసాలు కనిపిస్తాయి.

ఏకశిలానగరానికి ఎలా చేరుకోవాలంటే..
చెన్నై–ముంబాయి రైలుమార్గంలోని ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో దిగి ఒంటిమిట్ట(ఏకశిలానగరం)కు చేరుకోవచ్చు. కడప నుంచి రేణిగుంట తిరుపతికి వెళ్లే బస్సు మార్గంలో , కడప నుంచి 25కిలోమీటర్ల దూరంలో ఒంటిమిట్ట వస్తుంది.

ఆలయ చరిత్ర..
విజయ నగర స్రామాజ్యంలో క్రీ.శ 1340లో ఉదయగిరి పాలకుడు కంపరాయలు ఒంటిమిట్ట ప్రాంతంలో పర్యటించారు. ఆయన కొంతపరివారాన్ని వెంటబెట్టుకొని వచ్చాడు. ఈ అడవుల్లో ఇద్దరు బోయలు ఉండేవారు. వారే వంటడు, మిట్టడు. వీరు రాజుగారికి సేవలందించారు. ఈ సమయంలో సమీపంలో గుట్టమీద చిన్నపాటి గుడి ఉంది. జాంబవంతుడు నిలిపిన శిలలో సీతారామలక్ష్మణులని భావించి దండం పెట్టుకొంటున్నారని, అక్కడ గుడి కట్టి పుణ్యం కట్టుకోమన్నారు. సీతమ్మను వెతుకుతూ ఒకనాడు జాంబవంతుడు ఈ గుట్టమీద విశ్రమించాడని, ఆరాత్రి అక్కడే నిద్రించాడని ఉదయం తిరిగి వెళ్తూ ఆ శిలలో సీతారామలక్ష్మణులను భావించుకొని నమస్కరించుకొని వెళ్లాడట. వంటడు..మిట్టడు చెప్పిన మేరకు కంపరాయలు గుడి, చెరువు నిర్మించేందుకు అంగీకరించారు. ఆ బాధ్యత బోయలకే అప్పగించారు. కాగా.. ఒంటడు.. మిట్టడు.. ఆలయ నిర్మాణంలో భాగం అయ్యారు గనుకనే ఈ ఆలయానికి ఒంటిమిట్ట అనే పేరు వచ్చిందనే పురాణ కథ ప్రాచుర్యంలో ఉంది.

కోదండరాముడి బ్రహ్మోత్సవాల వివరాలు..

తేది (ఏప్రిల్)	ఉదయం	రాత్రి
06	ధ్వజారోహణం	శేష వాహనం
07	వేణుగానాలంకారం	హంస వాహనం
08	వటపత్రసాయి అలంకారం	సింహ వాహనం
09	నవనీత కృష్ణాలంకారం	హను మత్సేవ
10	మోహినీ అలంకారం	గరుడ సేవ
11	శివధనుర్భాలంకారం	గజ వాహనం
12	రథోత్సవం	
13	కాళీయమర్ధన అలంకారం	అశ్వవాహనం
14	చక్రస్నానం	ధ్వజాఅవరోహణం
15	సాధారణ కార్యక్రమాలు	పుష్పయాగం, ఏకాంతసేవ

ఏకశిలానగరంగా..
ఒంటిమెట్ట మీద నిర్మించిన ఆలయం ఉన్న ప్రదేశం ఒంటిమిట్ట అయింది. ఒంటిమిట్ట గుడికి అనురూపంగానే ఏర్పడిన మరోపేరు ఏకశిల. ఒకేశిలలో సీతారామలక్ష్మణ విగ్రహాలు నిర్మితమై ఉన్నాయి. ఇది అరుదైన సంగతి. జాంబవంతుడు ముగ్గుర్ని ఒకే శిలలో భావించుకొన్నాడు. ఆ తర్వాత కాలంలో కంపరాయలు, బుక్కరాయలు అదే సంప్రదాయంతో ఏకశిలలో ముగ్గురు మూర్తులు ఉండేటట్లు నిర్మాణం చేయించారు. బహుశా ఒకే శిలలో ముమ్మూర్తులను నిలిపిన సంఘటన ఒంటిమిట్టలో మొదటిగా ఆవిష్కృతమైంది. అరుదుగా కొలవైన ఏకశిలావిగ్రహ ప్రాంతాన్ని ఏకశిల అని భక్తితో అన్నాడు పోతన.

రాత్రిపూటే కల్యాణం..
ఒంటిమిట్ట స్వామివారి కల్యాణం రాత్రిపూట నిర్వహిస్తారు. చతుర్థశినాటి రాత్రి వివాహ మహోత్సవం, కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామ కల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడని పురాణకథ చెపుతోంది. కాగా రాత్రి కల్యాణం సంప్రదాయం ఇప్పటిదికాదు. అది ఒంటిమిట్ట ఆలయం ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇలాగే జరుగుతోంది. అన్ని రామాలయాలలో నవమిరోజున కల్యాణం నిర్వహిస్తారు. అది పగటిపూట. ఒక్క ఒంటిమిట్ట కోదండరామాలయంలోనే రాత్రి పూట రాములోరి కల్యాణం జరుగుతుంది. ఈ నెల11న రాత్రి 8–10 గంటలలోపు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.

రామయ్య సేవలో కవులు
ఒంటిమిట్ట కోదండరామాలయంలో వెలసిన రఘురాముడిని సేవిస్తూ కవులెందరో తరించారు. వారిలో అయ్యలరాజు తిప్పయ్య, బమ్మెర పోతన, అయ్యలరాజు రామభద్రుడు, ఉప్పుగొండూరు వెంకట కవి, వరకవి నల్లకాల్వ అయ్యప్ప, వాసుదాసు వావిలికొలను సుబ్బారావులు తమతమ స్థాయిలో కోదండరామునిపై సాహిత్యం, కీర్తనలు, రచనలుతో పాటు ఆలయ అభివృద్ధికి తోడ్పడ్డారు.

ఆలయ నిర్మాణం ఇలా..
విజయ నగర సామ్రాజ్య చక్రవర్తి బుక్కరాయలు ఒంటిమిట్ట గుడిలో ఏకశిలా విగ్రహం నిలిపిన నాటికి గర్భాలయం, అంతరాళం, చిన్నగోపురం ఉండేవి. మొదటి దశ నిర్మాణమిది. మూడవ దశలో మహా మంటపం (రంగ మంటపం), మహా ప్రాకారం, తూర్పు, ఉత్తర , దక్షిణ గాలిగోపురాలు, మహా ప్రాకారం లోపల నైరుతి దిక్కున కళ్యాణ మంటపం, ఆగ్నేయ దిశలో పాకశాల, ప్రాకారంలోపల ఉత్తరం వైపు తూర్పున, పడమర ఎదుర్కోలు మంటపాలు, రామలింగదేవుని గుడి (1966)లో లింగాన్ని నిలిపారు. సంజీవరాయస్వామి, రథం, రథశాలను ఏర్పాటుచేశారు. అనంతరం అనంతరాజు గుడిని విస్తరించాడు. మహామంటపం, మహాప్రాకారం, గాలిగోపురాల నిర్మాణాలు చేపట్టారు. తెలుగురాష్ట్రాలలో ఒంటిమిట్ట గాలిగోపురాల తరహాలో మరెక్కడా కనిపించవు. ఈ ఆలయాన్ని దర్శించిన టావెర్నియర్ అనే యాత్రికుడు ఎత్తయిన గోపురాలు చూసి విస్మయం చెందాడు.



ఒంటిమిట్ట కోదండ రామాలయం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణ

రామయ్యకు బ్రహ్మోత్సవ శోభ
ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలతో ఏకశిలానగం శోభాయమానంగా వెలుగొందనుంది. ఇప్పటికే కళ్యాణవేదిక ముస్తాబు, భక్తుల కోసం గ్యాలరీలు చకచకా ఏర్పాటుచేశారు. 60 గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. వీవీవీఐపీ, వీఐపీ, సాధారణ భక్తులను దృష్టిలో ఉంచుకొని గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. దాశరథి కల్యాణానికి వచ్చే భక్తులకు తోపులాట వాతావరణం లేకుండా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. రేపటి నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు దాదాపు పూరికావస్తున్నాయి.

దాశరథి కోవెలలో నవమి ఏర్పాట్లు...
ఒంటిమిట్టలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరోజున ఆలయంలో పోతన జయంతి కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనున్నది. కవిసమ్మేళనం నిర్వహిస్తారు. నవమి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున రానున్నారు.

9న కడప బిషప్ పట్టాభిషేక ఉత్సవం

కడప కల్చరల్: కడప కథోలిక పీఠం బిషప్‌గా మోస్ట్ రెవరెండ్ డాక్టర్ పాల్ ప్రకాశ్ సగినాలకు ఈనెల 9న ఉదయం 10 గంటలకు పట్టాభిషేకం నిర్వహించనున్నారు. కడప బిషప్స్ హౌస్ సమాచారం మేరకు..... స్థానిక మరియాపురంలోని సెయింట్ జోసెఫ్స్ బాలుర హైస్కూలు మైదానంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత అపోస్థలిక అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ కడప డయాసిస్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ గాలిబాలి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల బిషప్‌లు అతిథులుగా హాజరు కానున్నారు.

రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్‌లో వేగం పెంచాలి

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

లక్కిరెడ్డిపల్లె: పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి, గాలివీడు మండలాలకు చెందిన ఏఈఓలు, వీహెచ్‌ఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రానాయక్ మాట్లాడారు. ఇప్పటి వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందని, మిగిలిన 20 శాతం కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఒకొక్క మండలానికి బడ్జెట్ లో రూ.9 లక్షలు కేటాయించారన్నారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న రైతులు ఈ నెల 8లోపు రాయితీ పోగా మిగిలిన నగదును చెల్లించేలా చొరవ చూపాలన్నారు. సకాలంలో నగదును చెల్లించలేని పక్షంలో ఇతర అర్హత కలిగిన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వర్తింపజేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కంది సాగు చేసిన రైతులకు మద్దతు ధర కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా క్వింటా కందులు రూ.7550 తో రైతు సేవాకేంద్రాల ద్వారా పేర్లు నమోదు చేసుకునేలా వ్యవసాయ సిబ్బంది తోడ్పడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, వ్యవసాయాధికారి రమేష్‌బాబు రావు, ఏఈఓలు ఆంజనమ్మ, కెరోలిన్, అనూష, వీహెచ్‌ఏలు లావణ్య, హరిత, రేఖ, సౌజన్య, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఒంటిమిట్టలో జరిగే శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవానికి ఈనెల 11న జిల్లాలోని వివిధ డిపోల నుంచి 135 ప్రత్యేక బస్సులను నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 35, పులివెందుల 10, బద్వేలు 20, జమ్మలమడుగు 10, మైదుకూరు 5, ప్రొద్దుటూరు 15, ఇతర రీజియన్ డిపోల నుంచి 40 బస్సులు చొప్పున మొత్తం 135 బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. కలెక్ట్ ఆదేశాల మేరకు, టీటీడీ వారి సౌజన్యంతో కడపవైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం నుంచి కల్యాణోత్సవం జరిగే ప్రాంతానికి ఐదు ఉచిత బస్సులు, రాజంపేట వైపు సాలాబాద్ క్రాస్ పార్కింగ్ స్థలం నుంచి కల్యాణోత్సవం జరిగే ప్రాంతానికి మరో ఐదు ఉచిత బస్సులను నడపనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమి సందర్భంగా ఈనెల 11, 12 తేదీల్లో గిరి ప్రదక్షిణ నిమిత్తం అరుణాచలానికి జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి ఈనెల 11న రాత్రి 10, 12న ఉదయం 9.30 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా సర్వీసులు బయలుదేరుతాయన్నారు.
- బద్వేలు డిపో నుంచి 12న ఉదయం 9 గంటలకు కడప, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ మీదుగా అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందన్నారు.
- మైదుకూరు డిపోనుంచి 11వ తేదిన ఒక బస్సు పోరుమామిళ్లలో మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరి కడప, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ మీదుగా, మరొకబస్సు మైదుకూరులో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి కడప,చిత్తూరు మీదుగా వెళుతుందన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి 11వ తేదిన సాయంత్రం 6 గంటలకు మైదుకూరు, కడపమీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఈనెల 12న ఉదయం 7.00 గంటలకు రాయచోటి, పీలేరు మీదుగా అరుణాచలంకు సర్వీసు వెళుతుందన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి ఈనెల 11వ తేది రాత్రి 8 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా ప్రత్యేక బస్సు సర్వీసు అరుణాచలానికి వెళుతుందన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



అనంతరాజుపేట తూర్పుపల్లిలో నేలకొరిగిన అరటి తోట



కూలిపోయిన రేకుల ఇల్లు

- నేలకొరిగిన అరటి చెట్లు
- లబోదిబోమంటున్న రైతులు

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని రైతులు దోస, అరటి, బొప్పాయి, మామిడి పంటలను ధరలు లేక నష్టపోయిన సమయంలో.. గురువారం కురిసిన అకాల వర్షం నట్టేట ముంచింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వీచిన పెనుగాలులు, భారీ వర్షం 20 నిమిషాల పాటు విలయతాండవం చేశాయి.

ఎక్కడికక్కడ మామిడి, అరటి పంటలు తీవ్ర స్థాయిలో రైతులు నష్టపోయారు. అన్ని రకాల పంటలకు ధరలు లేక ఉన్న కొద్దిపాటి దిగుబడులతో.. జీవనాధార ఖర్చులకు వస్తుందన్న ఆశతో ఉన్న రైతులకు అకాల వర్షం తీవ్ర నష్టానికి గురిచేసింది. కోడూరు మండలంలో అరటి, బొప్పాయి, మామిడి పంటలకు తీవ్ర నష్టాన్ని కల్గించింది. అలాగే అనంతరాజుపేటలో ఆవులకుంట వెంకటేష్‌కు చెందిన రేకుల ఇల్లు, పూరికొట్టం పూర్తిగా కుప్పకూలిపోయింది. అలాగే పలు ప్రాంతాలలో విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. రాఘవరాజుపురంలోని టీడీపీ కార్యాలయం వద్ద బోర్డు కుప్పకూలింది.

చెట్టు విరిగిపడి వ్యక్తికి గాయాలు
గాలివీడు : గాలివీడు మండల పరిధి రాయచోటి–గాలివీడు ప్రధాన రహదారి కరిమిరెడ్డి గారి పల్లె వద్ద గురువారం కురిసిన వర్షం ఈదురుగాలులతో చెట్టు విరిగి కొమ్మలు పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గోరాన్ చెరువు గ్రామం వడిశాలంకవాండ్ల పల్లెకు చెందిన ఎం.చెన్నకృష్ణారెడ్డి వ్యవసాయ పనుల మీద మండల కేంద్రానికి వస్తున్న సమయంలో మార్గంమధ్యలో సంఘటన చోటుచేసుకుని వ్యక్తికి తలభాగం, ముక్కుపైన గాయాలతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి
పెద్దమండ్యం: పిడుగుపాటుతో మూడు పాడి ఆవులు మృతి చెందాయి. మండలంలోని పెద్దమండ్యం పంచాయతీ చెరువుకిందపల్లెకు సమీపంలోని యర్రగొండ వద్ద గురువారం సాయంత్రం ఘటన జరిగింది. చెరువుకిందపల్లెకు చెందిన జి. నాగేశ్వరనాయుడు పాడి ఆవులు, గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. పల్లెకు సమీపంలోని యర్రగొండ కింద హంద్రీ–నీవా కాలువ పక్కనే బోరు ఉంది. బోరుకింద పాడి ఆవుల మేత వేసి అక్కడే ఉన్న చింతచెట్టుకింద ఆవులను కట్టేసి మేత వేశారు. సాయంత్రం ఉరుములతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. ఉరుములు పెద్ద ఎత్తున వస్తుండడంతో చెంతచెట్టుకింద ఉన్న రైతు నాగేశ్వరనాయుడు భార్య, కుమారుడు సమీపంలోని గొర్రెల దొడ్డి వద్దకు వెళ్లారు. చిరుజల్లులు నిలిచిపోవడంతో పాడి ఆవులను మేతకోసం ఇప్పించుకు వెళ్లి చూడగా మూడు పాడి ఆవులు పిడుగు పాటుకు గురై మృతిచెందడంతో బోరున విలపించారు. ఘటనపై గ్రామస్తులు రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని రెవెన్యూ, పశు సంవర్ధకశాఖ అధికారులు పరిశీలించారు. పాడిరైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

జజ్జనకర జనారే.. జాతర భళారే..!

- వైభవంగా బలిజపల్లె గంగమ్మ జాతర
- ఆకట్టుకున్న యువకుల విన్యాసాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



ప్రత్యేకంగా తయారు చేసిన గుడిలో కొలుదీరిన గంగమ్మ



జాతరలో జనసందోహం

రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లెలో గురువారం గంగమ్మ జాతర సంబరం అంబరమంటింది. వేడుక బుధవారం రాత్రి నుంచే అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తొలుత నిర్వహణలో భాగస్వాములైన నాపరపురెడ్డిపల్లె నిర్వాహకులు, ప్రజలు.. గంగమ్మ సోదరుడైన పోతురాజును ఊరేగిస్తూ అమ్మవారికి నవధాన్యాలు తీసుకొచ్చారు. అనంతరం గంగమ్మకు పుట్టినిల్లయిన తుమ్మల అగ్రహారం నుంచి.. ఆ గ్రామ మహిళలు పెద్దఎత్తున గండదీయలను బలిజపల్లెకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన నిర్వాహకులు, యువకులు తప్పెట్ల దరువుకు అనుగుణంగా అడుగులు వేస్తూ.. కర్రసాము విన్యాసాలు చేస్తూ, దీపావళిని తలపించేలా బాణాసంచా పేల్చుతూ చేరుకున్నారు. బలిజపల్లెలో గంగమ్మ ప్రతిమ తయారైన అనంతరం.. నిర్వాహకులు గురువారం తెల్లవారుజామున రథంలో అమ్మవారిని ఊరేగిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన వేపమండల గుడిలోకి తీసుకొచ్చి కొలువు దీర్చారు. గంగమ్మ ఊరేగింపుగా గుడిలోకి వచ్చే సమయంలో పోతురాజును ఎగిరించేందుకు భక్తులు పోటీపడ్డారు. గంగమ్మ గుడిలోకి వస్తుండగా.. వందలాది మంది భక్తులు ముద్దలు పెట్టి అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు.

గంగమ్మా.. కాపాడమ్మా

ఈ సందర్భంగా భక్తులు 'అమ్మా గంగమ్మ తల్లి.. మము కరుణించి కాపాడమ్మా' అంటూ వేడుకున్నారు. గంగమ్మ గుడిలోకి చేరుకోక ముందే వేలాది మంది బలిజపల్లెకు చేరుకోవడంతో.. బలిజపల్లె గ్రామం ఇసుకవేసినా రాలనంతగా భక్తులతో నిండిపోయింది. అమ్మవారు గుడిలో కొలువు దీరాక భక్తులు ఒక్కసారిగా గంగమ్మను దర్శించుకునేందుకు త్వరపడటంతో పోలీసులు అధికారులు, సిబ్బంది అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గంగమ్మ గుడిలో కొలువుదీరగానే జాతర ఒక్కసారిగా ఊపందుకుంది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు కిలోమీటరు మేర భక్తుల రద్దీ కొనసాగింది.

దారులన్నీ జాతర వైపే

బలిజపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి వరపడితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందువల్ల బుధవారం రాత్రి నుంచే గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు బలిజపల్లెకు చేరుకోవడం ప్రారంభించారు. జాతరలోకి వచ్చేందుకు నాలుగువైపులాఉన్న రహదారుల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో పట్టణంలోని అన్ని దారులు జాతరవైపు సాగి కోలాహలంగా మారాయి.

గంగమ్మను దర్శించుకున్న ఆకేపాటి, పోలా

జాతర సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి.. గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. బలిజపల్లె గంగమ్మ ఎంతో విశిష్టత సంతరించుకున్న దేవత అని, గంగమ్మ బలిజపల్లె గ్రామంలో స్వయంభుగా వెలియడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. బలిజపల్లె గంగమ్మ వల్ల జిల్లాలోనే కాక రాష్ట్రంలోనూ రాజంపేటకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని తెలిపారు. గంగమ్మ కరుణతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిపించి ప్రజల, రైతుల కష్టాలు తీర్చాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన గంగమ్మ జాతరలో తాను ప్రతి ఏడాది పాల్గొని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, అమ్మవారిని వేడుకునే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమని తెలిపారు.



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



సుబ్బయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి సోదరుడు అనిల్‌రెడ్డి

రాజంపేట : మండలంలోని కొమ్మివారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎలకచర్ల గంగసుబ్బయ్యపై.. అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఒకరు బుధవారం దాడి చేశాడు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండరాదని హెచ్చరించిన క్రమంలో.. ఇరువురి మధ్య వాదులాట కొనసాగింది. దీంతో ఆగ్రహావేశానికి గురైన టీడీపీ నాయకుడు దాడికి దిగాడు. ఈ క్రమంలో గంగసుబ్బయ్య గాయపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం రాజంపేట ప్రాంతీయవైద్యశాలకు తరలించారు. దాడికి పాల్పడిన కార్యకర్త టీడీపీ నాయకుడు కావుటూరి మణి దగ్గర పని చేస్తున్నాడని బాధితుని తరఫున గొంటుమణి తెలిపారు. కాగా ఈ సమాచారం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సోదరుడైన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌రెడ్డి గాయపడిన సుబ్బయ్యను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని పోలీసులను కోరారు. కాగా లీగల్ మెడికో కేసు కింద మన్నూరు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది. తమకు న్యాయం చేయాలని బాధితుడి కుటుంబీకులు కోరారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, గొంటు మణి, అరిగెల నాని తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

కేవీపల్లి : మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ యువకుడిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని మార్లేళ్ల కస్పాకు చెందిన 9వ తరగతి విద్యార్థినిని అదే గ్రామానికి చెందిన రెడ్డిమీరా సాహెబ్ (32) లైంగిక వేధింపులకు పాల్పడ్డట్లు బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పొడ దుప్పిని కాపాడిన గ్రామస్తులు



పొడ దుప్పిని కాపాడిన టక్కోలు బీసీ కాలనీ గ్రామస్తులు

సిద్దవటం : మండలంలోని టక్కోలు బీసీ కాలనీలోకి వచ్చిన పొడ దుప్పిని గ్రామస్తులు కాపాడారు. వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం అటవీ ప్రాంతం నుంచి గురువారం జనారణ్యంలోకి రావడంతో.. కుక్కలు చూసి దాడి చేస్తాయనే ఉద్దేశంతో స్థానికులు కాపాడి ఫారెస్టు అధికారులకు తెలియజేశారు. ఇందుకు స్పందించిన కడప రేంజర్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఫారెస్టు సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని పొడ దుప్పిని స్వాధీనం చేసుకొని అటవీ ప్రాంతంలోకి వదిలేశారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ పంచాయితీ గంగన్న గారి పల్లె హరిజనవాడకు చెందిన రాజు (42) స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం స్థానికంగా ఓ ముస్లిం కుటుంబంలో వివాహ కార్యక్రమం ఉండగా, దీనికి సంబంధించి వారు రాజును టెంకాయ పట్టలు తెచ్చేందుకు కూలీకి పిలిచారు. కొబ్బరి చెట్టు ఎక్కి మట్టలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు చికిత్సలు అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ గదికి తరలించారు. కూలికి పిలిచిన వ్యక్తులు కనీసం పట్టించుకోకుండా వెళ్లిపోయారని బాధితుని కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద వాపోయారు. మృతుడికి భార్య రమణమ్మ కుమారులు శివాజీ (19) సంతోష్(15) కుమార్తె మహేశ్వరి(23) ఉన్నారు.

పాముకాటుతో...

మదనపల్లె : పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. చీకల బైలు గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య గౌరమ్మ (45) పొలం వద్ద పని చేస్తుండగా పాము కాటు వేసింది. అయితే ఏదో పులుగు ముట్టుకుందని భావించి నిర్లక్ష్యంగా ఉండడంతో, రాత్రి 7 గంటల సమయంలో నోటి నుండి నురగ రావడం మొదలైంది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు చికిత్సలు అందిస్తుండగా పరిస్థితి విషమించి గౌరమ్మ మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా గౌరమ్మ కుమారుడు సందీప్ గతంలో పశువుల మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. ప్రస్తుతం ఆమెకు కుమార్తె లీలావతి ఉంది.

హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు



నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె : హత్య కేసులో సాక్షాధారాలతో నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు మదనపల్లె రెండవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి జీవితఖైదు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.11 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం ఆర్టీసీ డిపో వెనుకవైపు ఉన్న ఆంజనేయస్వామి గుడి సమీపంలో 2017 ఆగస్టు 22న గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురై పడి ఉండటాన్ని గుర్తించి అప్పటి వీఆర్‌ఓ నారాయణ నాయక్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నంబర్ 104/2017 అండర్ సెక్షన్ 302, 201, రెడ్‌విత్ 34 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసి అప్పటి సీఐలు నిరంజన్‌కుమార్, సురేష్‌కుమార్, గంగిరెడ్డి దర్యాప్తు చేశారు. హత్యకు గురైన వ్యక్తి కర్ణాటక రాష్ట్రం కె.ఆర్ పురానికి చెందిన కృష్ణమూర్తి కుమారుడు అశోక్ (32)గా గుర్తించారు. అతను ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. పట్టణంలోని బాంబుబజార్(మేదరవీధి)కి చెందిన శవాల భాస్కర్ (53) భార్యతో అశోక్ వివాహేతర సంబంధం ఉన్నాడన్న అనుమానంతో హత్య జరిగిందని నిర్ధారించారు. హత్య కేసులో ఏ1గా శవాల భాస్కర్(53), ఏ2గా గుర్రప్ప కుమారుడు ఎస్.వెంకటేష్ (బాంబూబజార్), ఏ3 రామారావుకాలనీకి చెందిన ఏసు కుమారుడు కె.కల్యాణ్‌ను నిందితులుగా గుర్తించి వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజర పరిచి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో గురువారం రెండవ ఏడీజె కోర్టులో వాదనలు ముగిశాయి. నిందితులపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ తీర్పుపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్పందిస్తూ గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసి వివిధ క్రిమినల్ కేసులలో నిందితులకు శిక్షలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు, టూటౌన్ సీఐ రామచంద్ర, ఏపీపీ జయనారాయణరెడ్డి, కోర్టు లైజన్ ఆఫీసర్ సతీష్‌కుమార్, కోర్టుహెడ్ కానిస్టేబుల్ టీవీ బాలసుబ్రమణ్యం, కోర్టు పీసీ మధుకుమార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

నేకనాపురంలో ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

సిద్దవటం : మండలంలోని నేకనాపురం ఎస్సీ కాలనీలో గురువారం గంగమ్మ జాతర సందర్భంగా జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. జాతర సందర్భంగా అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే బోనాల విషయంపై వివాదం చోటుచేసుకుని.. ఘర్షణకు దారితీసింది. అమ్మవారికి బోనం తమ ఇంట్లో నుంచే ముందు సమర్పించాలని దనాసి వెంకటసుబ్బయ్య, దనాసి శ్రీనివాసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో దనాసి వెంకటసుబ్బయ్యపై శ్రీనివాసులు కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. అడ్డువచ్చిన కొండా గంగాదేవి తలపై బడిశతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంకటసుబ్బయ్య చెల్లెలు పావనికి స్వల్ప గాయం అయింది. కుప్పకూలిన గంగాదేవిని గ్రామస్తులు సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం 108 వాహనంలో ముగ్గురిని కడప రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామస్తులు చెప్పిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏటా గ్రామంలో జరిగే గంగమ్మ జాతరకు పెద్దల సంప్రదాయంగా.. దనాసి వెంకటసుబ్బయ్య ఇంట్లో నుంచే అమ్మవారికి నైవేద్యంగా బావించే బోనం సమర్పిస్తారని, శ్రీనివాసులు అనే వ్యక్తి తమ ఇంట్లో నుంచి అమ్మవారికి బోనం వెళ్లాలని ఘర్షణకు దిగారని.. ఈ ఘర్షణలో దనాసి వెంకటసుబ్బయ్య, కొండా గంగాదేవి, పావనీలపై కత్తితో, బడిశతో దాడి చేశారని తెలిపారు. ఈ విషయమై ఏఎస్‌ఐ సుబ్బరామచంద్రను వివరణ కోరగా.. నేకనాపురం ఎస్సీ కాలనీలో జరిగిన గంగమ్మ జాతరలో ముగ్గురు వ్యక్తులపై శ్రీనివాసులు అనే వ్యక్తి దాడి చేశారని వెంకటుబ్బయ్యకు, గంగాదేవికి బలమైన గాయాలు తగిలాయని, పావనికి స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. దనాసి వెంకటసుబ్బయ్య పోలీసులకు దనాసి శ్రీనివాసులు, రమణమ్మ, వెంకటరమణ, వెంకటమ్మలపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.





తీవ్రంగా గాయపడిన కొండా గంగాదేవి, గాయపడిన వెంకటసుబ్బయ్య

సభ్యులు లేకుండానే మండల సమావేశం

- ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బహిష్కరణ
- వాయిదా వేయకుండా, నిర్వహించిన వైనం
- నిబంధనలకు విరుద్ధమంటున్న అధికారులు
- ఆపైన కూటమి నేతలకు అధికారిక ఆహ్వానం



మండల మీట్‌కు హాజరైన అధికారులు, ముందు వరస ఎడమవైపు కూటమి నాయకులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండల మీట్‌ను సభ్యులు లేకుండానే నిర్వహించడం చర్చనీయాంశమైంది. గురువారం ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన మొదలైన సమావేశాన్ని 10 మంది ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. 11 మంది ఎంపీటీసీల్లో ఎంపీపీ మినహాయిస్తే.. మిగిలిన వారంతా సమావేశానికి హాజరైన కొన్ని నిమిషాలకే బహిష్కరించి వెళ్లిపోయారు. వీరితోపాటే అందరూ సర్పంచులు బహిష్కరించారు. అయితే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలను మొత్తం ఎంపీటీసీలు బహిష్కరిస్తే.. ఆ సమావేశాన్ని అధికారులు వాయిదా వేయాలే కాని నిర్వహించకూడదన్న నిబంధన ఉందని అధికారులు అంటున్నారు. అయితే ఒక్క ఎంపీటీసీ లేకున్నా మండల మీట్‌ను కొనసాగించడంపై చర్చకు దారితీసింది. సమావేశానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఎంపీటీసీలు ఉంటే సమస్యలపై చర్చించడం లేదా అభివృద్ధి పనులపైనా సమీక్షించడం జరుగుతుంది. కేవలం అధికారులున్న సమావేశంలో వారికి వారే సంబంధిత శాఖకు సంబంధించిన వివరాలను వెల్లడించుకున్నారు. సభ్యులు కాని కొందరు.. అధికారులను కొన్ని అంశాలపై ప్రశ్నించారు. అధికారులు చర్చించుకున్నా, ఏదైనా అంశాలపైనా, అభివృద్ధి పనులపైనా ఆమోదిస్తూ తీర్మానం చేయాలంటే ఎంపీటీసీలు హాజరవ్వాలి. వారి ఆమోదంతో తీర్మానం చేయాలి. అలా కాకుండా ఎంపీటీసీలు హాజరు కానప్పుడు అధికారులు తమశాఖ అంశాలను ఎవరితో పంచుకోవాలి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేది ఎవరు అన్నది చర్చకు వచ్చింది. సమావేశాలు నిర్వహించేది ఎంపీటీసీలతో.. వాళ్లే హాజరు కానప్పుడు సమావేశానికి అర్థం ఏముందని అంటున్నారు. ఎంపీటీసీలు లేని సమావేశానికి విలువ లేనప్పటికీ కొనసాగించి పూర్తి చేయడం విడ్డూరమని మండల పరిషత్ అధికారులే అంటున్నారు.

వాళ్లకు ఆహ్వానం ఎందుకో..?

బి.కొత్తకోట మండల మీట్‌కు టీడీపీకి చెందిన ముగ్గురు, బీజేపీ, జనసేన నుంచి ఒక్కొక్కరిని అధికారులు ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులు కానటువంటి వ్యక్తులను, ఎంపీటీసీ కాని వారు సమావేశంలో ఉండకూడదని సర్క్యులర్‌లో అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. అయినప్పటికీ ఆ ఐదుగురిని రప్పించి సమావేశం ముందు వరసలో కూర్చోబెట్టారు. ఇది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సభ్యులను మాత్రమే లోపలికి పంపిన పోలీసులు.. వీరిని కూడా నిలువరించినా హాజరయ్యే సభ్యుల జాబితాలో వీరు ఉన్నారని అధికారులు చెప్పడంతో పోలీసులు అనుమతిచ్చారు. కాగా ఈ విషయమై విలేకరులు ఎంపీడీఓ దిలీప్‌కుమార్‌ను వివరణ కోరగా.. చిత్తూరు జెడ్పీ సీఈవో మౌఖిక ఆదేశాల మేరకు కూటమికి చెందిన ఐదుగురు నాయకులను మండల మీట్‌కు ఆహ్వానించడం జరిగిందన్నారు. మండల పరిషత్‌లో ఈ పార్టీలకు చెందిన ఎంపీటీసీలు లేనందున జెడ్పీ సీఈవో ఆదేశాలతో ఆహ్వానించామని చెప్పారు.

ఎంపీపీపై మాకు విశ్వాసం లేదు

- అందుకే తీర్మాన నోటీసు ఇచ్చాం
- మూకుమ్మడిగా మండల మీట్‌ను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు



మండల మీట్‌ను బహిష్కరించి బయటికి వచ్చిన ఎంపీటీసీలు, సర్పంచులు

బి.కొత్తకోట : 'బి.కొత్తకోట ఎంపీపీ లక్ష్మీనరసమ్మ మండల అభివృద్ధికి అడ్డుపడుతున్నారు, మేం ఇచ్చే ప్రతిపాదనలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నందున ఆమెపై మాకు విశ్వాసం లేదని అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చాం. అందుకే ఆమె అధ్యక్షత నిర్వహిస్తున్న మండలమీట్‌ను బహిష్కరిస్తున్నాం' అని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు మూకుమ్మడిగా బహిష్కరించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఎంపీపీ ప్రసంగించేందుకు సిద్ధమవ్వగా.. వైస్ ఎంపీపీ ఖాదర్‌వలీ మాట్లాడారు. 'ఎంపీపీపై ఫిబ్రవరి 6న అవిశ్వాస తీర్మానం కోరుతూ ఎంపీటీసీ సభ్యులతో నోటీసు ఇచ్చాం, ఎంపీపీపై విశ్వాసం లేదని నోటీసు ఇచ్చినందున ఆమె అధ్యక్షతన ఈ సమావేశంలో ఉండలేం, కాబట్టి బహిష్కరిస్తున్నాం' అని ప్రకటించారు. తర్వాత ఖాదర్‌వలీతోపాటు మరో వైస్ ఎంపీపీ ఎస్.రాధ, జెడ్పీటీసీ రామచంద్ర, ఎంపీటీసీలు ఎ.గౌతమి, బి.ఈశ్వరమ్మ, సి.విమలమ్మ, వి.రామసుబ్బారెడ్డి, సి.యల్లప్ప, ఎ.రమాదేవి, ఎ.బాలకృష్ణ, ఎ.సుబ్బయ్య, సర్పంచులు భీమిగాని నాగిరెడ్డి, మాకిరెడ్డి రవికుమార్‌రెడ్డి, రామక్క, సాంబశివ, రుక్మిణి, జయరామిరెడ్డి, ప్రమీల, సరస్వతమ్మ, గిరిజమ్మ, పుష్పలత, చంద, ఆదెప్ప, కోఆప్షన్ సభ్యుడు నాసీర్‌లు సమావేశం బహిష్కరించారు. ఈ సందర్భంగా వీరు ఎంపీడీఓ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అందులో ఎంపీపీపై తమకెలాంటి విశ్వాసం లేదని, ఎంపీటీసీలను నిర్లక్ష్యం చేయడం, తామిచ్చిన ప్రతిపాదనలను పక్కన పెట్టడం చేశారని పేర్కొన్నారు. అభివృద్ధికి అడ్డుపడుతూ ప్రజాప్రతినిధులమైన తమను పరిగణనలోకి తీసుకోకుండా, ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్నందున, నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. కాబట్టి ఈ మండల సమావేశంలో ఆర్థిక పరమైన నిర్ణయాలపై ఎలాంటి తీర్మానాలు చేయకూడదని, దీన్ని విస్మరించి తీర్మానం చేసినా చెల్లదని, ఈ విషయాన్ని రికార్డులో నమోదు చేయాలని కోరుతూ ఎంపీటీసీల సంతకాలతో వినతిపత్రం అందజేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ దిలీప్‌కుమార్ అన్నారు.

విద్యుత్ శాఖలో మాయగాడు!

- రూ.20 లక్షల వరకు కరెంటు బిల్లుల నగదు స్వాహా
- ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతోనే నిర్వాకం
- విషయం బయటికి పొక్కడంతో జూనియర్ లైన్‌మ్యాన్ పరారీ



గాలివీడులోని విద్యుత్ సబ్‌స్టేషన్

గాలివీడు : అతనో బాధ్యత కలిగిన విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులను వసూలు చేసి.. నగదు కార్యాలయంలో లెక్కచెప్పాలి. అయితే ఇక్కడ కంచే చేను మేసిన చందంగా వసూళ్ల నగదు మొత్తాన్ని స్వాహా చేసి.. గుట్టు చప్పుడు కాకుండా ఉడాయించాడు. వివరాల్లోకి వెళితే.. గాలివీడు మండల కేంద్రంలో సచివాలయం జూనియర్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న రామేశ్వర్‌రెడ్డి దాదాపుగా రూ.20 లక్షల వరకూ వినియోగదారుల వద్ద నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేసి నగదుతో ఉడాయించాడు. ఇతను ఇంటింటికీ వెళ్లి కరెంట్ బిల్లులు చెల్లించాలంటూ నగదు వసూలు చేసేవాడు. రశీదు ఇవ్వాలని అడిగితే, బిల్ తీసే యంత్రం పని చేయడం లేదు, మీ నగదు చెల్లింపులు పూర్తయ్యాయి. కాబట్టి మీకు ఎలాంటి ఇబ్బంది వుండదంటూ నమ్మబలికే వాడు. సదరు జూనియర్ లైన్‌మ్యాన్ మాత్రం ఎంచక్కా ఆ నగదుతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ జల్సా చేసేవాడు. ఇదే క్రమంలో మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని చిలకలూరిపేటలో విద్యుత్ బకాయిలు చెల్లించలేదంటూ సిబ్బంది వినియోగదారుల ఇళ్ల వద్దకు రావడంతో.. ఖంగుతిన్న బాధితులు తాము ఇది వరకే జూనియర్ లైన్‌మ్యాన్‌కు చెల్లించామంటూ వాపోయారు. ప్రస్తుతం సదరు ఉద్యోగి విధి నిర్వహణలో లేడని, మీ బిల్లుల నగదు చెల్లింపులు జరగలేదని, వెంటనే కరెంట్ బిల్ చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని సిబ్బంది హెచ్చరించడంతో.. వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో చేసేదేమీ లేక బాధితులు లబోదిబోమంటున్నారు. గతంలో ఎగువగొట్టివీడు గ్రామంలో విధులు నిర్వహించిన సమయంలో కూడా ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లుగా సమాచారం. అంతేగాక పరిచయం ఉన్న వాళ్ల దగ్గర పెద్ద మొత్తంలో అప్పుగా డబ్బులు తీసుకుని మోసం చేశాడంటూ పలువురు ఆరోపిస్తున్నారు. విద్యుత్ బకాయిల వసూళ్ల నగదు మొత్తం చెడు వ్యసనాలతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ.. అప్పులపాలై అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పరారైనట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. వెంటనే జిల్లా స్థాయి విద్యుత్ అధికారులు విచారణ జరిపి సదరు ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కాజేసిన సొమ్ము రికవరీ చేసి బాధితులకు ఇప్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నా వద్ద రూ.2800 తీసుకున్నాడు

నావద్ద కరెంట్ బిల్ కట్టాలని జూనియర్ లైన్‌మ్యాన్ రామేశ్వర్‌రెడ్డి రూ.2800 తీసుకున్నాడు.. కానీ కార్యాలయంలో జమ చేయలేదు. దీంతో మరుసటి నెలలో బిల్ మొత్తం చెల్లించాలని సిబ్బంది నన్ను హెచ్చరించారు. అంతేగాక తన వ్యక్తిగత అవసరాల కోసం నా వద్ద అప్పుగా రూ.20000 తీసుకున్నాడు. తిరిగి చెల్లించక పోగా ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు.

– రామచంద్ర, ఎగువగొట్టివీడు

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం

జూనియర్ లైన్‌మ్యాన్ రామేశ్వర్‌రెడ్డి మార్చి 10 నుంచి విధులకు హాజరు కాకపోవడంతో.. పరారీలో వున్నట్లుగా గుర్తించి ఇదే విషయమై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. విద్యుత్ బిల్లుల వసూళ్ల విషయంపై బాధితులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

– విజయ్‌కుమార్‌రెడ్డి, ఏడీ, విద్యుత్ శాఖ, రాయచోటి